క్లుప్తంగా

విద్యార్థికి సైకిల్ బహూకరణ



చైతన్యకు సైకిల్ బహూకరిస్తున్న హెచ్‌ఎం రత్నం

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి ముగడ చైతన్యకు ప్రధానోపాధ్యాయిని ఎం.వి.టి రత్నం గురువారం రూ.5400 విలువైన సైకిల్‌ను అందించారు. పంచాయతీలో కంచేరు పాలేనికి చెందిన చైతన్య తండ్రి మరణించగా.. తల్లి కూలిపనులకు వెళ్తారు. పేదరికం కారణంగా రోజూ గ్రామం నుంచి ఇరువైపులా ఆరు కిలోమీటర్లు నడిచి పాఠశాలకు, ఇంటికి వెళ్తుంటాడు. దీంతో చైతన్యకు సౌకర్యంగా ఉండేలా హెచ్‌ఎం రత్నం సైకిల్‌ను అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఇంకా కొందరు విద్యార్థులు వివిధ ప్రాంతాల నుంచి ఆటోలపై వస్తున్నారని, దాతలు స్పందించి వారికి ఆర్థిక భారం తగ్గేలా సైకిళ్లు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేఖ అప్పారావు, విజయకుమార్, సుశీల్‌కుమార్, త్రివేణి, రాజేశ్వరి పాల్గొన్నారు.

రామకార్యం ఎంతో గొప్పది



ప్రసంగిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

మధురవాడ: రామ కార్యంతో పాటు రామ నామం ఎంతో గొప్పదని బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. గాయత్రి విద్యాపరిషత్ మహిళ ఇంజినీరింగ్ కళాశాల వద్ద జరుగుతున్న సంపూర్ణ రామాయణ ప్రవచనాల్లో భాగంగా గురువారం కిష్కింధకాండలో పలు ఘట్టాలను వివరించారు. ఇందులో సీతమ్మవారిని వెదుక్కుంటూ దక్షిణ దిక్కుకు వెళ్లిన వానరాలు ఆహారం, నీరు, చెట్టు లేని ప్రాంతంలో చాలా కష్టాలు పడ్డారని తెలిపారు. అలా ముందుకు వెళ్లగా ఒక రాక్షసుడిని చూసి అతనే రావణుడని సంహరించారని, తరువాత ఒక గుహ కనబడగా అందులోకి వెళ్లగా అనేక ఆహార పదార్థాలు వారికి లభించాయని తెలియజేశారు. ఇంకా వారు ఏ విధంగా ముందుకు సాగారు, అలా వెళ్తున్నప్పుడు వచ్చే సమస్యలు, కష్టాలను శ్రీరాముడి అనుగ్రహంతో ఏవిధంగా పరిష్కరించుకుంటూ సాగారనే విషయాలను వివరించారు. రాములవారి కార్యము ఎంత గొప్పదో, దాని కోసం పనిచేసి వారందరూ ఎంత ధన్యులయ్యారో విశదీకరించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి 'గాదె'కు మద్దతుగా ప్రచారం



ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

భీమునిపట్నం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులు నాయుడుకు మద్దతుగా ఉపాధ్యాయులు గురువారం సాయంత్రం ఉపాధ్యాయుల ఇళ్లకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఎస్టీయూ, పీఆర్టీయూ, ఆపస్, ఏపీటీఎఫ్ తదితర ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలపగా, అందులోని ఉపాధాయులు ఈ మేరకు ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ శ్రీనివాసులు నాయుడు అందరికీ మేలు చేసే నాయకుడన్నారు. సమస్యలు వచ్చినప్పుడు అండగా ఉండేవారని.. ఆయనకు మద్దతు తెలపాలని కోరారు. ప్రచారంలో ముఖ్య సభ్యులు స్వామి, ఇమంది పైడిరాజు, డొకర శ్రీనివాసరావు, రెడ్డిపల్లి అప్పలరాజు, ఆల్బర్ట్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఒకరికి ఏడాది జైలు



నిందితుడు కృష్ణబాబు

తగరపువలస: రూ.లక్ష దొంగతనం చేసిన కేసుకు సంబంధించి నిందితుడు ఎర్నింటి కృష్ణబాబు(22)కు గురువారం భీమిలిలోని 16వ మెట్రోపాలిటన్ న్యాయస్థానం మేజిస్ట్రేట్ ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించింది. భీమిలి క్రైం ఎస్‌ఐ ఎస్.సూర్యప్రకాశరావు తెలిపిన వివరాలివి.. 2023 నవంబరు 6న తగరపువలస వైటివై ఎలైట్ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వాత్సాయి నరసింహరాజు ఇంట్లోకి నిందితుడు రాత్రివేళ కిటికీ ద్వారా చొరబడి డబ్బులు కాజేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పట్లో భీమిలి పోలీసులు విజయనగరం జిల్లా డెంకాడ మండలం గొందయ్యపాలెం గ్రామానికి చెందిన నిందితునిపై కేసు నమోదు చేశారు.

రహదారి శిథిలం



శిథిలమైన విజయరాంపురం రోడ్డు



గోతులు పడి ప్రమాదకరంగా..



వెంకటపతి రాజు చెరువు వద్ద శిథిలమైన తునిపాలం రోడ్డు



తునిపాలం గ్రామ సమీపంలో గోతులు పడిన రోడ్డు

- తరచూ ప్రమాదాలు
- పంచాయతీవాసుల అవస్థలు

పద్మనాభం: మండలంలోని రెండు పంచాయతీల్లో రోడ్లు పూర్తిగా శిథిలమయ్యాయి. దీంతో ఈ రోడ్లపై రాకపోకలు సాగించడానికి ప్రజలు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. పాండ్రంగి–అలమండ ఆర్‌ఎస్ రోడ్డు నుంచి మద్ది పంచాయతీ తునిపాలం, పాండ్రంగి.. అలమండ ఆర్‌ఎస్ రోడ్డు నుంచి బాందేవుపురం పంచాయతీ విజయరాంపురం బీటీ రోడ్లు శిథిలమయ్యాయి. ఒక్కొక్కటి సుమారు కిలోమీటరు నిడివి గల ఈ రెండు రోడ్లు మొత్తం గోతులు పడ్డాయి. రాళ్లు తేలిపోయాయి. తునిపాలం రోడ్డు మీదుగా మద్ది, మండల కేంద్రమైన పద్మనాభం, బాందేవుపురం గ్రామాలకు పాదచారులు, వాహనచోదకులు రాకపోకలు సాగిస్తుంటారు. మద్ది గ్రామస్తులు అనంతవరం వెళ్లడానికి ఈ రోడ్డు ఉపయోగపడుతుంది.

రాత్రివేళల్లో ప్రమాదాలు

విజయరాంపురం గ్రామస్తులు కూలి పనులకు ఉదయం విజయనగరం, విశాఖపట్నం వంటి దూరప్రాంతాలకు వెళ్లి, రాత్రికి ఇంటికి వస్తారు. రాత్రి వేళల్లో చీకటిలో మార్గం కనిపించక రాళ్లు తన్నుకుని పడిపోతున్నారు. వాహనచోదకులు గోతుల్లో పడి ప్రమాదాల పాలవుతున్నారు. వర్షం కురిస్తే గోతులు వర్షం నీటితో నిండిపోతున్నాయి. రోజురోజుకు ఈ రోడ్లు మరింత గతుకులమయంగా తయారవుతున్నాయి. పంచాయతీరాజ్ శాఖ పరిధిలోకి వచ్చే ఈ రెండు రోడ్లు శిథిలమై తొమ్మిదేళ్లు కావస్తున్నా వీటి మరమ్మతులకు చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్లు బాగు చేయాలని పంచాయతీవాసులు కోరుతున్నారు.

గోతుల్లో పడిపోతున్నాం



రోడ్డంతా గోతులు పడింది. రాళ్లు తేలిపోయాయి. ఆ మార్గంలో వెళ్లడానికి చాలా ఇబ్బంది పడుతున్నాం, రాత్రి వేళల్లో దారి కనిపించక రాళ్లు తన్నుకుని గోతుల్లో పడిపోతున్నాం. మా గ్రామం నుంచి మద్ది, పద్మనాభం వెళ్లి రావడానికి ఇబ్బంది పడుతున్నాం. విద్యార్థులు మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సైకిళ్లపై వెళ్లడం చాలా కష్టమవుతోంది. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

– కె.కన్నయ్య, తునిపాల

ఎడ్ల బళ్లు వెళ్లడం చాలా కష్టం



కిలో మీటరున్నర నిడివి గల మా గ్రామం రోడ్డు పూర్తిగా శిథిలమైంది. వ్యవసాయ దినుసులను కళ్లం నుంచి ఇంటికి ఎడ్ల బళ్లపై తీసుకు వెళ్లడానికి కష్టమవుతోంది. రోడ్డుపై నుంచి బండి వెళితే పడిపోతుందేమోనన్న భయంగా ఉంది. మా గ్రామం నుంచి కూలి పనులకు విశాఖపట్నం, విజయనగరం ఉదయం వెళ్లి రాత్రికి తిరిగి ఇంటికి వస్తారు. రోడ్డు బాగులేక రాక పోకలకు అవస్థలు పడుతున్నారు.

– వి.రమణ, విజయరాంపురం

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

భీమునిపట్నం: భీమిలిలో విద్యుత్ లైన్లకు ఇబ్బందికరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేపడుతున్నందున పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా బ్యాంక్ కాలనీ, తాతాజీనగర్, ఎల్లంపేట, మహాలక్ష్మీపురం, డెక్కతిపాలెం, రాజలింగంపేట, రేఖవానిపాలెం, రాయపాలెం, మరడపాలెం, మూలకుద్దు, భీమిలి టౌన్, స్మిత్ వీధి, జగనన్న కాలనీ, నేరెళ్లవలస కాలనీ, ఎస్‌వోఎస్ చిల్డ్రన్స్ విలేజ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పాఠశాలకు ఫ్యాన్ల వితరణ



హెచ్‌ఎంకు ఫ్యాన్లు అందిస్తున్న గంగిరెడ్డి

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ప్రాథమిక పాఠశాలకు నగరానికి చెందిన గాప్ టఫ్ గ్లాస్ సంస్థ రూ.25వేల విలువైన 16 ఫ్యాన్లు అందించింది. వీటిని సంస్థ ప్రతినిధి కొవ్వూరు గంగిరెడ్డి ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్‌కు గురువారం అందించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థుల సౌకర్యార్థం వీటిని అందించినట్టు గంగిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరలక్ష్మి, రామకృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

తగరపువలస: ఆనందపురం మండలం గిడిజాల పంచాయతీ దిబ్బడిపాలెంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ, పసిడి కలశ ప్రతిష్ఠా మహోత్సవాలు జరగనున్నాయి. అనకాపల్లి జిల్లా కశింకోటకు చెందిన రేజేటి శ్రీరామాచార్యులు, సీతారామాచార్యులు ఆధ్వర్యంలో ఈ ప్రతిష్ఠా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు తెలిపారు. చివరి రోజైన ఆదివారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

కన్వెన్షన్ సెంటర్ పనులు వేగవంతం చేయాలి

- వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్



జేవీ అగ్రహారం లే అవుట్‌లో బ్లూ ప్రింట్ పరిశీలిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

కొమ్మాది: ఎండాడలోని కన్వెన్షన్ సెంటర్ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం ప్రారంభోత్సవం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బీచ్ రోడ్డు ప్రాంతాల్లో గురువారం ఆయన క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. టీడీఆర్‌ల సమస్యను సాధ్యమైనంత త్వరగా క్లియర్ చేసి బోయపాలెం–కె.నగరపాలెం బృహత్‌ప్రణాళిక రహదారి పనులను పూర్తి చేయాలని సూచించారు.

కాపులుప్పాడ చెరువు సందర్శన

జల సంరక్షణ, గొలుసుకట్టు చెరువులను సంరక్షించే చర్యల్లో భాగంగా కాపులుప్పాడ చెరువును కాలుష్య నియంత్రణ మండలి, జీవీఎంసీ పర్యవేక్షణ ఇంజినీరు, ధాన్ ఫౌండేషన్ ప్రతినిధులతో కలసి ఆయన సందర్శించారు. చెరువుకు వచ్చే కాలుష్య కారకాలు గుర్తించి తగిన నియంత్రణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా చెరువుకు దారితీసే నీటొ వనరుల గుర్తింపు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. అనంతరం నిడిగట్టు, కొత్తవలస, రెడ్డిపల్లి, జయంతివాని అగ్రహారం గ్రామాల్లో ఆర్సీ లేఅవుట్‌లో జరుగుతున్న మౌలిక వసతుల కల్పన పనులు పరిశీలించి, రహదార్ల బీటీ పనులను మార్చి 31 లోపు పూర్తి చేయాలన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో ప్రధాన ఇంజినీరు వినయ్ కుమార్, ప్రధాన అర్బన్ ప్లానర్ శిల్ప, పర్యవేక్షక ఇంజినీర్లు భవాని శంకర్, బాలరామరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్లు మధుసూదన్, రామరాజు, సుధీర్, సింగ్ తదితరులు పాల్గొన్నారు.

30 పశువులకు వైద్యసేవలు



జీరుపేటలో పశువులకు వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు చిల్లపేట, జీరుపేట గ్రామాలలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 30 వరకు పశువులకు చికిత్స అందించారు. ఇటీవల ఈ ప్రాంతంలో దూడలలో లంపీ స్కిన్ వ్యాధి బయట పడటంతో భీమిలి సహాయ సంచాలకుడు డాక్టర్ బి.వెంకటరమణ ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పశువుల ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. అవసరమైన వాటికి మందులు అందించారు. కోళ్లకు కూడా అవసరమైన చికిత్స అందించారు. వెటర్నరీ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, రోహిత్‌కుమార్ సహాయ సహకారాలు అందించారు.

జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు కేథరిన్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న కేథరిన్ విద్యాసంస్థల అధినేత ఆలీవర్ ఆర్ రాయి

తగరపువలస: ఈ నెల 23న హర్యానాలో జరగనున్న జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలకు భీమిలి కేథరిన్ విద్యాసంస్థలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిలో 10వ తరగతి విద్యార్థి పి.మోహన్ రామిరెడ్డి, 9వ తరగతి విద్యార్థులు జె.పార్థ సాత్విక్‌రెడ్డి, ఎస్.గౌరీసుమతి, కె.ప్రసన్న ఉన్నారు. వీరు ఈ నెల 16న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో జరిగిన రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనపరచి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని కేథరిన్ విద్యాసంస్థల అధినేత ఆలీవర్ ఆర్ రాయి అభినందించారు.

గ్రీన్ టెక్నాలజీపై విద్యార్థులకు వర్క్‌షాపు



గ్రీన్ టెక్నాలజీ ప్రాముఖ్యతపై మాట్లాడుతున్న రామ్మూర్తినాయుడు

పీఎం పాలెం: కంప్యూటర్ ఇంజినీరింగ్‌లో గ్రీన్ టెక్నాలజీ ప్రాముఖ్యతపై విద్యార్థులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని ఆసియా ఐటీ సర్వీసెస్ ప్రిన్సిపల్ కన్సల్టెంట్ బి.రామ్మూర్తి నాయుడు సూచించారు. జీవీఎంసీ ఆరోవార్డులోని బాబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో నిర్వహించిన సాంకేతిక సాంస్కృతిక సింపోజియం వర్క్‌షాపును గురువారం ఆయన ప్రారంభించారు. స్థానిక కంప్యూటర్ సైన్స్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రీన్ టెక్నాలజీ పరిశ్రమలకు ఉపయోగపడుతుందన్నారు. కొత్త కోర్సులు నేర్చుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె. శ్రీలక్ష్మి మాట్లాడుతూ మూడు రోజులు జరిగే కార్యక్రమంలో విద్యార్థులు అనేక విషయాలు నేర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూర్ణ సత్యనారాయణ, కన్వీనర్ ప్రొఫెసర్ దుర్గా ప్రసాద్ మాట్లాడారు.

రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయి



మాట్లాడుతున్న బింగి హరికిరణ్‌రెడ్డి

తగరపువలస: రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన చిట్టివలసలో మాట్లాడుతూ రైతులకు బాసటగా గుంటూరు మిర్చియార్డులో పర్యటించిన మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి భద్రత కల్పించాల్సిన పోలీస్ యంత్రాంగం కూటమి తొత్తులుగా వ్యవహరిస్తూ, నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. మిర్చికి గిట్టుబాటు ధర లేక రైతులు అవస్థలు పడుతుంటే భరోసా ఇవ్వవలసిన కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లలో రైతు భరోసా కేంద్రాలు నిర్మించి పెట్టుబడి సాయం అందిస్తూ రైతు పక్షపాతిగా నిలిచారన్నారు. రాష్ట్రంలో వివిధ వర్గాల ప్రజల విశ్వాసం కోల్పోయిన కూటమి ప్రభుత్వానికి ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

డెబ్రిస్‌తో గోస్తనీ తీరం పూడ్చివేత



గోస్తనీనది వెంట వేస్తున్న డెబ్రిస్

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్ట గోస్తనీనది తీరాన్ని గుర్తు తెలియని వ్యక్తులు డెబ్రిస్‌తో పూడ్చి పెడుతున్నారు. శివాలయం ఎదురుగా నదీ తీరం వెంబడి కొద్ది రోజులుగా లారీలు, ట్రాక్టర్లతో ఇతర ప్రాంతాల నుంచి డెబ్రిస్‌ను తీసుకువచ్చి డంప్ చేస్తున్నట్టు కొండపేట, భోగాపురం వారి వీధి ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో నదీ గమనం మార్పు చెంది, భవిష్యత్తులో బంగ్లామెట్ట ముంపునకు గురవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ, సచివాలయ సిబ్బంది స్పందించి డెబ్రిస్‌తో నదిని పూడ్చకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చేపల మార్కెట్ రహదారిలో దుర్గంధం



వేములవలస చేపల మార్కెట్ ఎదురుగా ఖాళీ కొబ్బరి బొండాలు

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస చేపల మార్కెట్ రహదారిలో దుర్గంధం కారణంగా రాకపోకలు సాగించలేకపోతున్నాయని ఈ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో చేపల వ్యర్థాలతో పాటు ఖాళీ కొబ్బరి బొండాలు వేస్తున్నారు. అంతేకాక కొందరు ఈ మార్గాన్ని బహిర్భూమిగా కూడా వినియోగిస్తున్నారు. అయినప్పటికీ పంచాయతీ ఎలాంటి పారిశుధ్య పనులు నిర్వహించడం లేదు. ముఖ్యంగా తగరపువలస మీదుగా నడిచే సిటీ బస్సులు ఈ మార్గంలోనే వస్తున్నందున ప్రతిరోజూ వందలాది మంది ప్రమాణికులు, విద్యార్థులు, మహిళలు ఈ మార్గాన్ని వినియోగిస్తుంటారు. ఈ ప్రాంతంలో దుర్గంధం కారణంగా వీరంతా ముక్కు మూసుకోకుండా నడిచే పరిస్థితి లేదు. పంచాయతీ పాలకవర్గం స్పందించి, ఈ మార్గంలో రాకపోలకు సాఫీగా సాగేలా పారిశుధ్య పనులు నిర్వహించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అస్తవ్యస్తంగా విద్యుత్ స్తంభాలు



ద్రోణంరాజు కల్యాణమండపం ఎదురుగా చెట్ల మధ్య కనిపించకుండా ఉన్న విద్యుత్ స్తంభం



మధురవాడ కృష్ణానగర్ లే అవుట్‌లో కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

వేలాడుతున్న తీగలు

మధురవాడ: మధురవాడ కృష్ణానగర్ లే అవుట్‌లోని ద్రోణంరాజు కల్యాణ మండపం సమీపంలో విద్యుత్ స్తంభాలు, వైర్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఇక్కడ ఓ విద్యుత్ స్తంభం, దాని వైర్లు చెట్లలో కలసిపోయాయి. మరో విద్యుత్ స్తంభం ఒరిగిపోయి కూలడానికి సిద్ధంగా ఉంది. మరో 2 విద్యుత్ స్తంభాల మధ్య వైర్లు సాగిపోయి, వేలాడుతున్నాయి. వీటికి కేబుల్ ఇతర వైర్లు కూడా తోడయ్యాయి. దీంతో చిన్న గాలి వీచినా చెట్ల మధ్య ఉన్న వైర్లు రాపిడి జరిగి నిప్పులు రాలుతున్నాయని స్థానికులు తెలిపారు. సమీపంలో కల్యాణమండపం, ఓల్డేజ్ హోం ఉన్నాయని, ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి యలమంచిలికి చెందిన తొగరు అక్కయ్య రూ.లక్ష 116 విరాళం ఇచ్చారు. దాతకు స్టోర్స్ సీనియర్ అసిస్టెంట్ పి.సూరిబాబు బాండ్ అందించారు. కార్యక్రమంలో అన్నప్రసాద విభాగం ఉద్యోగి హరి పాల్గొన్నారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని అధికారులు అందించారు.

ప్రణాళికతో చదివితే సత్ఫలితాలు

ఆరిలోవ: పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు ఒక ప్రణాళితో చదవాలని డీఈవో ప్రేమ్‌కుమార్ సూచించారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం సాయంత్రం ఆయన సందర్శించారు. స్టడీ అవర్‌లో ఉన్న టెన్త్ విద్యార్థులతో మాట్లాడారు. వారిని హిందీ సబ్జెక్టుకు సంబంధించిన ప్రశ్నలు అడిగారు. పరీక్షలకు ఏవిధంగా చదవాలో తెలియేజేశారు. క్రమశిక్షణ, ప్రణాళికతో చదవడం అవసరమని, తద్వారా సత్ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల విషయంలో పర్యవేక్షణ అవసరమని ఉపాధ్యాయులకు డీఈవో సూచించారు.ఎంఈవోలు రవీంద్రబాబు, అనురాధ, హెచ్‌ఎం భవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అత్యవసర సేవలపై హైవే పెట్రోలింగ్ పోలీసులకు శిక్షణ



ప్రమాదానికి గురైన వ్యక్తికి సీపీఆర్ చేస్తున్న వైద్యురాలు

ఆరిలోవ: అనకాపల్లి జిల్లా పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో పోలీసులు హైవే పెట్రోలింగ్ నిర్వహించే సమయంలో అందించే అత్యవసర సేవలపై విశాలాక్షినగర్‌లోని కై లాసగిరి ఏఆర్ పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో గురువారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు తక్షణ సహాయం అందించడం, వారికి అవసరమైన ప్రథమ చికిత్స, సీపీఆర్ చేయడం, దగ్గరలో ఉన్న ఆస్పత్రులకు అత్యవసరంగా తరలించడం తదితర వాటి గురించి పోలీసులకు వైద్యులు వివరించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ ఈ శిక్షణ వల్ల హైవేపై ప్రమాదాలకు గురైన వారికి ఆ సమయంలో పెట్రోలింగ్ పోలీసులు అత్యవసరంగా సమర్థవంతమైన సేవలు అందించడానికి అవగాహన కలుగుతుందన్నారు. అనకాపల్లి జిల్లా పోలీస్ యూనిట్‌కు చెందిన వైద్యులు పోలీసులకు అత్యవసర సేవలపై అవగాహన కల్పించారని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ పి.నాగేశ్వరరావు, అనకాపల్లి పోలీస్ యూనిట్ డాక్టర్ తబస్సుం అరా, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.